క్లుప్తంగా

ముందస్తు అరెస్టులు

బూర్గంపాడు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారపాక పర్యటన నేపథ్యంలో బీఆర్‌ఎస్, సీపీఎం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం రాత్రి సారపాకకు చెందిన బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీనివాస్, బెజ్జంకి కనకాచారి, సోము చైతన్యరెడ్డి, పంగి సురేష్‌లతోపాటు మరికొందరిని అదుపులోకి తీసుకున్నారు. సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లును కూడా అదుపులోకి తీసుకున్నారు. వీరిని పాల్వంచ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఎం పర్యటన అనంతరం వదిలిపెట్టారు.

అరెస్టులు సరికాదు..

దమ్మపేట: జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో పలు పార్టీలకు చెందిన నాయకులను ముందస్తుగా అరెస్టులు చేయడం అక్రమం అని సీపీఎం(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకుడు అమర్లపూడి రాము ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై గళమెత్తి ప్రశ్నించే వారిని అరెస్టులతో ఆపాలనుకోవడాన్ని విమర్శించారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజా ఉద్యమాలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు అదుపుతప్పి ఢీకొన్న ఘటన ఆదివారం రాత్రి జరగ్గా.. ఇద్దరు గాయాలపాలయ్యారు. ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని కావడిగుండ్లలో రేషన్ డీలర్‌గా పని చేస్తున్న భూక్య కృష్ణ, రేషన్ షాపులో బియ్యం పంపిణీ చేసి అశ్వారావుపేటకు బైక్ వస్తున్నాడు. ఈ క్రమంలో కొత్త గంగారం గ్రామం వైపు మరో ద్విచక్రవాహనంపై బి.రమేష్, ఎస్.నాగరాజు, వి.కొర్రాజులు వెళ్తున్నారు. ఈ రెండు బైక్‌లు దొంతికుంట–వాగొడ్డుగూడెం మార్గంలో ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కృష్ణ కాలు విరగ్గా, కొత్త గంగారం గ్రామానికి చెందిన బి.రమేష్ స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేసి, తీవ్రంగా గాయపడిన కృష్ణను మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



వేడుకల్లో బీజేపీ నాయకులు

అశ్వారావుపేట: బీజేపీ ఆవిర్భావ వేడుకలను ఆదివారం అశ్వారావుపేటలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1980లో స్థాపించిన బీజేపీ వరుసగా మూడు సార్లు అధికారంలోకి వచ్చిందని, ఈసారి తెలంగాణలో కూడా అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జల్లిపల్ల అరవింద్, చిట్టి శ్రవణ్, సోలస పుష్కర్, గొట్టాపు అప్పారావు, కాకి రాము, శీమకుర్తి సుబ్బారావు, జల్లిపల్లి ఫణి, సింహాచలం, అక్షయ్, కృష్ణారావు పాల్గొన్నారు.

మంత్రికి ఆహ్వానం

దమ్మపేట: మండలంలోని దురదపాడు గ్రామంలో నిర్వహించనున్న అంకమ్మ తల్లి జాతర మహోత్సవానికి హాజరుకావాలని కోరుతూ.. ఆ గ్రామస్తులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆదివారం మండలంలోని గండుగులపల్లి వ్యవసాయ క్షేత్రంలో మంత్రిని కలిసిన గ్రామస్తులు.. ఈ నెల 6 నుంచి 9 వరకు నిర్వహించనున్న అంకమ్మ తల్లి జాతర ఉత్సవాలకు రావాలని కోరారు. కార్యక్రమంలో కాసాని నాగప్రసాద్, కొమరం వెంకటేశ్వరరావు, మంగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది వితరణ

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల పంచాయతీ పరిధిలోని పిరాయిగూడెం గ్రామంలో అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు విద్యుత్‌శాఖ సిబ్బంది ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. మండల విద్యుత్ శాఖ ఏఈ మోహన్‌రెడ్డి బాధిత కుటుంబాలకు 5 బస్తాల బియ్యం పంపిణీ చేయగా.. ఏడీఈ ప్రభాకర్‌రావు, సిబ్బంది ఒక్కో కుటుంబానికి రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. దుమ్ముగూడెం, చర్ల విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన


గుండాల: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం గుండాల మండలంలో పర్యటిస్తున్నట్లు తహసీల్దార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని కాచనపల్లి గ్రామంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి హాజరవుతున్నారని వెల్లడించారు. గుండాల మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించనున్నట్లు తెలిపారు. మండలాధికారు హాజరుకావాలని సూచించారు.

కమనీయం.. రమణీయం | సీతారాముల కల్యాణం

శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం సీతారాముల కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. రామాలయాల్లో ఉదయం నుంచే అభిషేకాలు చేశారు. స్వామి వారి విగ్రహాలను ఊరేగింపుగా కల్యాణ మండపంలోకి తీసుకురాగా.. మంగళవాయిద్యాలతో, అర్చకుల మంత్రోచ్ఛరణలతో శ్రీ సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు తరలివచ్చి ఆ ఘట్టాన్ని తిలకించారు. ఆపై భక్తులకు వడపప్పు, పానకం ప్రసాదాలను పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్





దుమ్ముగూడెం: పర్ణశాలలో స్వామి వారికి తలంబ్రాలు పోస్తున్న అర్చకులు, సీతమ్మవారి తాళిబొట్టును భక్తులకు చూపుతూ..



మణుగూరురూరల్: దేవతామూర్తుల పల్లకీ మోస్తున్న ఏరియా జీఎం దుర్గం రామచందర్



మణుగూరురూరల్: సమితిసింగారంలో సీతారాముల కల్యాణ క్రతువు..



అశ్వారావుపేటరూరల్: రామాలయంలో అన్నదాన కార్యక్రమం



అన్నపురెడ్డిపల్లి : రాజాపురం గ్రామంలో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



దమ్మపేట: వేద పండితుడు విజయమారుతి శర్మ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం..



బూర్గంపాడు: నాగినేనిప్రోలులో కల్యాణమూర్తుల ఊరేగింపు



అశ్వారావుపేట: ఆంజనేయస్వామి ఆలయంలోని కల్యాణంలో పాల్గొన్న భక్తులు



ములకలపల్లి: భక్త అభయాంజనేయ స్వామి ఆలయంలో కల్యాణం..



దుమ్ముగూడెం: పెద్దనల్లబల్లి గ్రామంలో పానకం అందిస్తున్న స్థానికులు



గుండాలలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న దృశ్యం



అశ్వారావుపేట: కోదండ రామాలయం వద్ద అన్నదానం..



అశ్వాపురం: కల్యాణంలో పాల్గొన్న భక్తులు



దుమ్ముగూడెం: పర్ణశాలలో స్వామి వారి కల్యాణానికి హాజరైన భక్తజనం



దుమ్ముగూడెం: స్వామివారిని పల్లకీపై ఊరేగింపుగా ఆలయానికి తీసుకొస్తున్న అధికారులు



గుండాల: ఆళ్లపల్లిలో కోలాటం ఆడుతున్న మహిళలు

వెల్లివిరిసిన సేవభావం

భద్రాచలంటౌన్: భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామివారి కల్యాణం తిలకించేందుకు భద్రాచలం వచ్చిన భక్తులకు స్థానికులు ఆదివారం అనేక రకాలుగా మర్యాదలు చేసి సేవా భావాన్ని చాటుకున్నారు. ప్రధాన రహదారికి ఇరువైపుల టెంట్లు వేసి ఎవరికి తోచిన రీతిలో వారు భక్తులకు భోజనం, పులిహోర, బెల్లం పానకం, మజ్జిగా, శీతల పానీయాలను అందజేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో భక్తులు పంపిణీ కేంద్రాల వద్ద బారులు తీరారు. పట్టణంలోని పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

పులిహోర ప్రసాదం..

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో సీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం సందర్భంగా ఆదివారం



భద్రాచలంటౌన్: నిమ్మరసం ఉచితంగా పంపిణీ చేస్తున్న కూల్‌డ్రింక్ షాపు నిర్వాహకులు

వందలాది మంది భక్తులకు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్య ఆగ్రో ఏజెన్సీస్ యజమాని సోమ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పులిహోర ప్రసాదం వితరణగా అందజేశారు. వెంకటరెడ్డి భక్తులకు క్వింటాన్నర పులిహోర ప్రసాదం అందజేశారు.

గిరి ప్రసాద్ జయంతి

అశ్వారావుపేటరూరల్: సీపీఐ సీనియర్ నాయకుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు నల్లమల్ల గిరి ప్రసాద్ ఆశయాలను సాధించాలని ఆ పార్టీ నియోజకవర్గం కార్యదర్శి ఎస్‌డి.సలీం అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద గిరి ప్రసాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ.. సీపీఐ బలోపేతానికి గిరి ప్రసాద్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో గన్నిన రామకృష్ణ, పఠాన్ జలాల్ ఖాన్, ఎస్‌డి.దస్తగిరి, నూకవరపు విజయ్‌కాంత్, జోగిరాజు, జక్కం బలరాం, సత్యవతి, షేక్ రిజ్వానా, శ్రావణి, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న లోతువాగు కష్టాలు

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామంలో లోతువాగుపై హైలెవల్ వంతెన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వంతెన పనులు పూర్తవగానే రెండు వైపులా అప్రోచ్ రహదారి పనులు జరుగుతున్నాయి. ప్రతి ఏడాదీ వర్షాకాలంలో లోతువాగు పొంగి ప్రవహించి తుమ్మలచెరువు, వెంకటాపురం గ్రామ పంచాయతీలలోని గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచి గిరిజనులు బాహ్య ప్రపంచానికి దూరమవుతున్నారు. ఎన్నో ఏళ్లుగా వర్షాకాలంలో మూడు నెలల పాటు అవస్తలు పడుతున్నారు. వంతెన నిర్మించాలని గిరిజనులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం గత ప్రభుత్వంలో లోతువాగుపై రూ.5 కోట్లతో వంతెనకు శంకుస్థాపన చేయగా.. ఏడాది కాలం పనులు ప్రారంభం కాలేదు. నూతన ప్రభుత్వంలో



లోతువాగుపై నిర్మించిన వంతెన

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చొరవ తీసుకోవడంతో వంతెన పనులు ప్రారంభమై శరవేగంగా కొనసాగాయి. ప్రస్తుతం వంతెన పనులు పూర్తయ్యాయి. వర్షాకాలంలో తుమ్మలచెరువు, వెంకటాపురం గ్రామ పంచాయతీల గిరిజనులకు కష్టాలు తీరనున్నాయి.

ఉక్కపోతకు తల్లడిల్లిన భక్తులు

దుమ్ముగూడెం: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి అనుబంధ పర్ణశాల పుణ్యక్షేత్రంలో ఆదివారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించగా.. పాల్గొన్న భక్తులు ఉక్కపోతతో అల్లాడారు. కల్యాణ మండపం మొత్తం షామియానతో డెకరేట్ చేయడంతో పై నుంచి భగభగ మండుతున్న ఎండవేడిమి కింది భాగంలో ప్రభావం చూపింది. ఆలయ అధికారులు షామియానల కింద కూలర్‌లు ఏర్పాటు చేసినప్పటికీ అవి సరిపోలేదు. దీంతో ఎండ వేడి తట్టుకోలేక భక్తులు చేతి రుమాలు, పేపర్‌లతో విసురుకున్నారు. ఇబ్బందులు పడ్డారు.

కానరాని శిలాఫలకాలు

మూలన పడేశారు..



శిలాఫలకం లేక ఖాళీగా ఉన్న దిమ్మె

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామ పంచాయతీ నూతన భవనానికి సంబంధించిన శిలాఫలకం బోర్డును మూలన పడేశారు. గతేడాది ఆగస్టు 20వ తేదీన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతుల మీదుగా పంచాయతీ కార్యాలయం భవనాన్ని ప్రారంభించారు. కాగా, ఈ ప్రారంభోత్సవ శిలాఫలకం దిమ్మె నుంచి ఊడి పడిపోయింది. దాన్ని కార్యాలయంలోని గదిలో పక్కన పెట్టారు. నెలల గడుస్తున్నా ఆ ఫలకాన్ని తిరిగి ఏర్పాటు చేయడం లేదు. దీనిపై జీపీ కార్యదర్శి సాయిని 'సాక్షి' వివరణ కోరగా.. శిలాఫలకాన్ని భవనం లోపల త్వరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ముక్కలుగా విరిగిపోయి..



పడిపోయి ఉన్న శిలాఫలకం ముక్క

ములకలపల్లి: ములకలపల్లి–తాళ్లపాయ మధ్య ఉన్న వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి 2023 అక్టోబర్ 5న నాటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. రూ 4.5 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వంతెన నిర్మాణ వివరాలు తెలుపుతూ.. శిలాఫలకాన్ని ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అయితే ప్రస్తుతం శిలాఫలకం నామరూపాలు లేకుండా పోయింది. కనీసం బ్రిడ్జి నిర్మాణం కూడా పూర్తికాలేదు. కానీ శిలాఫలకం జాడే లేకుండా వాగు ప్రాంతాల్లో అక్కడక్కడ ముక్కలుగా నేలపైపడి కనిపిస్తోంది. ఎమ్మెల్యే స్థాయి ప్రజాప్రతినిధి ఆవిష్కరించిన శిలాఫలకం ఇలా దయనీయంగా మారడంపట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలతో ప్రాణం పదిలం

- రోడ్డు ప్రమాద మృతుల్లో యువతే ఎక్కువ
- డ్రంకెన్ డ్రైవ్, హెల్మెట్ ధరించకపోవడమే ప్రధాన కారణం
- ట్రాఫిక్ రూల్స్ పాటించడమే మార్గం

దుమ్ముగూడెం మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం యువతే మృత్యువాత బారిన పడటం ఆందోళన కలిగిస్తోంది. వందేళ్ల జీవితాన్ని మధ్యలోనే రోడ్డు ప్రమాదం రూపంలో ముగించడం కన్న తల్లిదండ్రులకు కడుపుకోతను మిగుల్చుతోంది. ఇప్పటి వరకు మండలంలో ఇలా ప్రాణాలు వదిలిన వారిలో మద్యం సేవించి వాహనం నడిపిన వారు కొందరైతే.. హెల్మెట్ లేకుండా ప్రయాణించిన వారు ఎంతోమంది.

దుమ్ముగూడెం: మండలంలోని గ్రామాలకు విశాలమైన రహదారులు ఏర్పాటు చేయడంతోపాటు గ్రామాల్లో శుభకార్యాలు, దినకార్యాలు ఏది జరిగినా మద్యం తాగడం కొంపముంచుతోంది. మోతాదుకు మించి తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మద్యం, హెల్మెట్ ధరించకపోవడంతోపాటు మితిమీరిన వేగం, ట్రిబుల్ రైడింగ్‌తో ప్రయాణిస్తూ ప్రజలను చేస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నారు.

12 మంది మృతి.. క్షతగాత్రులు అనేకులు..

మండలంలో 2024 జనవరి నుంచి డిసెంబర్ వరకు రోడ్డుప్రమాదాల్లో 12 మంది మృతి చెందినట్లు అధికారిక లెక్కలు చెప్పుతుండగా అనధికరంగా అధికంగానే ఉండే అవకాశాలు ఉన్నాయి. ఇందులో హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై మృతి చెందిన వారే



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ అశోక్ (ఫైల్)

అధికంగా ఉన్నారు. అలాగే వాహనాలు నడుపుతూ రోడ్డుప్రమాదాలకు గురై క్షతగాత్రులుగా మారిన వారి సంఖ్య అధికారికంగా ఉంది. అయినప్పటికీ అనాధికరంగా మృతుల కంటే ఈ సంఖ్య ఎక్కువగా ఉన్నాయి. రోడ్డు భద్రత నియమాలు పాటించకుండా మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్న యువత తమ ప్రాణాలను చేతులారా తీసుకుంటూ ఇతరుల ప్రాణాలను తీస్తున్నారు.

యువత దారెటు?

కొంతమంది యువత దారితప్పి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. హై స్పీడ్ బైక్‌లను కొనివ్వకపోతే సచ్చిపోతాం అంటూ తల్లిదండ్రులను బెదిరించి మరి కొనుగోలు చేస్తున్నారు. ఆపై మితిమీరిన వేగంతో, ఎదుటి వారికి భయం కలిగేలా నడుపుతున్నారు. అక్కడితో ఆగక మద్యం తాగి, హెల్మెట్ ధరించకుండా ప్రయాణించడం ప్రమాదాలకు మరింత ఆజ్యం పోసినట్లు అవుతోంది. ఇంకొందరైతే బైక్‌లపై వెళ్తూ సెల్‌ఫోన్‌లో మాట్లాడటం కూడా ప్రమాదాలకు అవకాశం ఇచ్చినట్లవుతోంది.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

హెల్మెట్ ధరించపోవడంతో మండలంలో ఎక్కువ ప్రమాద మృతులకు కారణమవుతున్నట్లు గుర్తించిన పోలీస్ శాఖ.. మండలంలో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై తిరుగుతున్న వారికి సీఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐలు వెంకటప్పయ్య, గణేష్‌లు గత పది రోజులుగా వివిధ కూడళ్లలో అవగాహన కల్పిస్తున్నారు. హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలని, మద్యం తాగి డ్రైవింగ్ చేయొద్దని సూచిస్తూ అవగహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

విస్తృత తనిఖీలు..



డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తాం. మద్యం తాగి వాహనం నడిపితే కఠిన శిక్షలు పడేలా కేసులు నమోదు చేస్తాం. మండలంలో నెలకు ముగ్గురు చొప్పున మృత్యువాత పడటం ఆందోళన కలిగించే అంశం. హెల్మెట్ వినియోగించకపోతే జరిమానా, మద్యం తాగి డ్రైవ్ చేస్తే కేసు తప్పదు.

– బి.అశోక్, సీఐ